
# స్వచ్ఛమైన ప్రేమ

హార్ధిక

వర్షాకాలం దీవెనలను ఉరిమి చల్లగా వీడ్కోలు చెప్పింది. ఈ ఏడాది దండిగా వానలు కురిశాయి. ఎక్కడ చూసినా పచ్చదనమే. భూమాత ఆకుపచ్చ పట్టుచీర కట్టుకున్నట్లుంది. అంతలో శీతాకాలం మెల్లగా ప్రవేశించి అందరి మనసుల్లో ఆహ్లాదం నింపింది. నెలలు గడిచాయి. ఎండాకాలం వెచ్చవెచ్చగా పరుచుకోసాగింది. చూస్తూ వుండగానే పచ్చదనమంతా ఆవిరి కావడం మొదలైంది. ఎండుటాకుల గలగలలు... కొంతకాలానికి మళ్ళీ వర్షరుతువు పలకరింపు, పులకరింపు ఆరంభమయ్యాయి. మోడులైన చెట్లు చిగురించాయి.



పోయిన వానాకాలంలో తోటలోని క్రోటన్ మొక్క గుబురుగా పెరిగింది. ఒక్క ఆకు కూడా రాల్చకుండా చలినీ, ఎండల్నీ తట్టుకుంది. అయితే, ఎండాకాలం ముగియవస్తుండగా దాని ఆకులు టపటపా రాలిపోవడం మొదలైంది. ఎర్రగా పండిన క్రోటన్ దళాలు సూర్యకాంతిని ఒడిసిపట్టుకుని అందంగా మిలమిలలాడడం చూస్తే మనసు ఆనందంతో విప్పారుతుంది. నిన్నరాత్రి తొలకరి చినుకులు తెల్లారేసరికల్లా క్రోటన్ ఆకుల మీద ముత్యాల్లా వేలాడుతుంటే, వాటిలో సూర్యరశ్మి నర్తనం ఎంతో మనోహరంగా వుంటుంది. ఎండాకాలం నిష్క్రమించేసరికి క్రోటన్ మొక్క మీద ఒక్కటి తప్ప అన్ని ఆకులూ రాలిపోయాయి. వర్షాలకు ఆ మొక్క కొత్త ఆకులు చిగురించాయి. వాటి మధ్య ఏకాకిగా వున్న పాత ఆకు చిత్రంగా కనిపిస్తోంది. అరుణ సూర్యునిలా మిగలపండేవరకు ఆ ఏక దళం

అలానే నిలిచి వుంది. బహుశా తల్లి మొక్కతో దాని అనుబంధం అంత గట్టిదనుకుంటా. నేను చాలారోజులు ఆ అందమైన పండుటాకును చూస్తూనే వున్నా. ఇంకా ఎన్నాళ్ళు మహారాణిలా దర్పంగా నిలబడతావో కదా! అనుకున్నా.

అంతలో ఒకరోజు నేను పనిమీద టూర్‌కు వెళ్ళవలసి వచ్చింది. అదిగో, ఆ టూర్‌లోనే మా కాలేజీ రోజుల అందాలరాణి శాంతి తారసపడింది.

***

ఆమెను చూసి ఎన్నో ఏళ్ళు అయింది. అందుకని వెంటనే ఆమెను గుర్తుపట్టలేకపోయాను. విశాఖపట్నంలో పని ముగించుకుని బస్సు ఎక్కాను. తల మీద చీర చెంగు కప్పుకుని ఉన్న ఓ కుందనపు బొమ్మ నా ముందు సీటుపైన సామాను బ్యాగ్ పెట్టుకోవడం చూసి, నా గుండె ఒక్కక్షణం లయ తప్పింది. ఇంత అందాలబొమ్మ పక్కనే రాత్రంతా ప్రయాణం చేసే భాగ్యం కలిగిందని నన్ను నేనే అభినందించుకున్నాను.

ఆమె బ్యాగ్ సర్దుకునేవరకు ఆగి నా సామాను సర్దుకున్నాను. తిరిగి నా సీట్లో కూర్చునేటప్పుడు ఆమె తలమీద నుంచి చీర చెంగు తీసి తన సీట్లో కుదురుకుంటోంది. అప్పుడు నన్ను చూసి, గుర్తుపట్టింది. ఆమె ముఖం ఆనందంగా విప్పారింది. అదే క్షణంలో నేను కూడా ఆమెను గుర్తుపట్టాను.

''బాగున్నావా శాంతీ! నిన్ను చూసి ఎన్నో ఏళ్ళయింది. మీ శ్రీవారు ఎలాగున్నారు? ఎంతమంది పిల్లలు?'' గడగడా వచ్చేశాయి ప్రశ్నలు.

ఆమె మళ్ళీ మందహాసం చేసింది. ఏదో చెప్పబోతున్నట్లు ఒక్కసారి గట్టిగా శ్వాస తీసుకుంది. అదే సమయంలో ఆమె ముఖంలో ఏదో నల్లమబ్బు కమ్మడం గమనించాను.

'నీవు ఎలా వున్నావ్?' ప్రశ్నించిందావిడ.

'నేనా.. బాగానే వున్నా' అని చెప్పాను, మా కాలేజీ బ్యూటీని ఇన్నాళ్ళకు మళ్ళీ కలిశానన్న సంతోషం నుంచి తెప్పరిల్లుతూ, మా మధ్య కొన్ని క్షణాలు మౌనం రాజ్యమేలింది.

శాంతి నా వంక లోతుగా చూసింది. ఈసారి ఆమె వదనంలో మబ్బులు విడివడుతున్నాయి. మెల్లగా ప్రశాంతత చోటుచేసుకుంటోంది. బస్సులోని దీపాల వెలుగులో ఆమె ముఖం బంగారంలా మెరుస్తోంది. ఆ అమాయకమైన కళ్ళు, మచ్చలేని ముఖవర్చస్సు ఏమీ చెక్కుచెదరలేదు.

'విజయ్ ఎక్కడున్నాడో తెలుసా?' కంపిస్తున్న స్వరంతో అడిగిందామె.

'తెలియకేం! నీ పెళ్ళిలో చివరిసారి కలిశాం. అప్పటినుంచి తరచూ కలుసుకుంటూనే వున్నాం. విజయ్ చాలా ఏళ్ళు పెళ్ళి చేసుకోకుండానే వుండిపోయాడు. రెండు మూడేళ్ళ క్రితమే ఒక ఇంటివాడయ్యాడు. అదీ తల్లి ఒత్తిడి మీదనే. ఆమె ఎంతో ఎంతో పోరిన మీదట దగ్గర బంధువుల్లో ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. తర్వాత హైదరాబాద్‌లో ఏదో వ్యాపారం మొదలెట్టాడు'' నా నోట సమాచార ప్రవాహం ఆగింది.

ఆమె ముఖంలో కొద్దిపాటి ఆశ్చర్యం చూశాను. నల్లమబ్బులు తిరిగి రాసాగాయి.

'విజయ్ నిన్ను మరచిపోలేదు శాంతీ! మేమిద్దరం ఎప్పుడు కలుసుకున్నా నీ గురించే మాట్లాడేవాడు' ఈసారి విషాదం మెల్లగా నన్ను చుట్టుముట్టింది.

విజయ్ శాంతిని ఆరాధించాడు. అయితే, ఆ విషయాన్ని ఎన్నో నెలలు తనలోనే దాచుకున్నాడు. తర్వాత నెమ్మదిగా తన మనసు విప్పాడు. శాంతి అతని ప్రేమను స్వీకరించింది. కానీ, ఇద్దరి తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించలేదు. 'వాళ్ళతో ఏంటి పని? లేచిపోయి పెళ్ళి చేసుకుందాం' అని విజయ్ శాంతిని బతిమాలాడు. అయితే, శాంతి భయంతో అందుకు ఒప్పుకోలేదు. కాలేజీలో డిగ్రీ పూర్తిచేశాక పెద్దలు కుదిర్చిన సంబంధం చేసుకుంది. బాగా డబ్బున్న బంధువుల అబ్బాయిని పెళ్లి చేసుకుంది. విజయ్ గుండె పగిలింది. ఏళ్ళు గడుస్తున్నా శాంతిని మరిచిపోలేకపోయాడు. వేదనా జ్వాల దహించివేసింది. అదే సెగలో పైచదువులు పూర్తిచేసి, వృత్తిలో పైమెట్టుకు వెళ్ళాడు.

తీరా అతడు పెళ్ళి చేసుకుని జీవితంలో కుదురుకుంటున్న సమయంలో ఇప్పటికీ విజయ్ గురించే ఆలోచిస్తున్న శాంతి తారసపడటం ఆశ్చర్యం.

ఆమె ముఖం తిప్పుకుని, పరుగెడుతున్న బస్సు వెలుపల రాత్రి చీకట్లోకి దీర్ఘంగా వీక్షించసాగింది. ఆమె కళ్ళలో కన్నీరు ఉబికివస్తోంది.

గతంలోకి వెళ్ళి జ్ఞాపకాల అలల్లో తనను తాను కోల్పోయినట్లుంది.

అలలు వెనుకముఖం పట్టేదాకా ఆగాను.

ఉన్నట్టుండి శాంతికి వయసు మీదపడినట్లనిపించింది. విషాదం నిండిన కళ్ళతో నావంక చూసింది.

'మీరంతా నన్ను తిట్టుకున్నారు కదూ! విజయ్ మాట విననందుకు!' తనలో తాను గొణుక్కున్నట్టు అన్నది. 'బహుశా ఇందువల్లనే ఏమో నా జీవితంలో అన్నీ కోల్పోయాను' చీర కొంగుతో కన్నీరు తుడుచుకుంది.

**ఉన్నట్టుండి శాంతికి వయసు మీదపడినట్లనిపించింది. విషాదం నిండిన కళ్ళతో నావంక చూసింది. 'మీరంతా నన్ను తిట్టుకున్నారు కదూ! విజయ్ మాట విననందుకు!' తనలో తాను గొణుక్కున్నట్టు అన్నది. 'బహుశా ఇందువల్లనే ఏమో నా జీవితంలో అన్నీ కోల్పోయాను' చీర కొంగుతో కన్నీరు తుడుచుకుంది.**

'నో నో ప్లీజ్' గొణిగాను, ఆమెను ఎలా ఓదార్చాలో తెలియక.

శాంతి కొంతసేపు అలా మౌనంగా రోదిస్తూనే వుండిపోయింది. ఆమె విషాదానికి అడ్డుతగలకుండా నేను కూడా నిశ్శబ్దంగా కూర్చున్నాను – వాన వెలిశాక ప్రశాంతత నెలకొంటుందని ఆశిస్తూ.

'నాకు బుద్ధిలేదు' కన్నీరు తుడుచుకుంటూ అన్నది శాంతి. ఆ క్షణంలో దుర్బలంగా కనిపించినా దృఢత్వమూ తొంగిచూసింది.

'బుద్ధితక్కువయ్యే తల్లిదండ్రుల మాటకు తల వంచాను'. ఒక్క క్షణం ఆగి, 'నేను విజయ్‌తో వెళ్ళిపోవలసింది' అన్నది శాంతి.

'అతణ్ణి కలుసుకోవాలని ఉంది. ఎలా? నీవు నాకు సాయం చేయగలవా?' మళ్ళీ చెమర్చిన కళ్ళతో బేలగా అడిగింది శాంతి.

'తప్పకుండా. అయితే, దీనికి రెండు మూడు రోజులు పడుతుంది' చెప్పాను. ఈవిడ ఏం చేయబోతోంది? ఆమెకేం కావాలి అని నాలో నేను ప్రశ్నించుకుంటూ.

'మొదట నీవు విశ్రాంతి తీసుకో. చాలా బలహీనంగా కనిపిస్తున్నావ్'

ఆపైన కళ్ళు మూసుకుని సీటుమీద తల ఆనించాను.

శాంతి మరో గంటసేపు జ్ఞాపకాల్లోనే వుండిపోయింది. తర్వాత ఆమెను కూడా నిద్ర ఆవహించింది.

బస్సు గమ్యం చేరడానికి ఇంకా గంట వుందనగా నాకు మెలకువ వచ్చింది. నా కళ్ళు ఆమెవైపే తిరిగాయి. శాంతి బస్సులో నుంచి వెనక్కు పరుగెడుతున్న చెట్లను చూస్తోంది. ఆమె ముఖం లో ఎలాంటి భావమూ కనిపించడం లేదు. ఆమె కళ్ళు బయటకు చూస్తున్నా మనసు ఎక్కడో వుంది.

నేను నిద్రలేచిన సవ్వడి విని శాంతి చిరునవ్వుతో నావంక చూసింది. నా గురించీ, నా కుటుంబం గురించీ అడిగింది. అన్నీ చెప్పి, ఆమె గురించి ప్రశ్నలు వేశాను. జ్ఞాపకాల భారం వదలడం వల్ల ఈసారి ఆమె నా ప్రశ్నలకు సమాధానమిచ్చింది.

'పెళ్ళయ్యాక రెండేళ్ళపాటు మా సంసారం సజావుగానే సాగింది. ఎటువంటి పొరపొచ్చాలు లేవు. ఒకరినొకరు గౌరవించుకునేవాళ్ళం. ప్రేమగా ఉండేవాళ్ళం. మాకు ఓ బిడ్డ కలిగినా, బాలారిష్టాల వల్ల కొద్దిరోజుల్లోనే చనిపోయింది. మా వారు పట్టుదల లేని మనిషి. పిత్రార్జితమే ఆయన సంపద. ఆ సంపద మెల్లగా హరించుకుపోసాగింది. అది ఆయనలో చిరాకుపరాకులు పెంచింది. మా జీవితం దుర్భరంగా మారింది' చెప్పుకుపోయింది శాంతి.


'చివరకు గత ఏడాది విడాకులు తీసుకున్నాం. ఆయన వెంటనే మరో పెళ్ళి చేసుకున్నారు. నా తల్లిదండ్రులకు నా నిర్ణయం నచ్చలేదు. నేను ఒంటరిగా మిగిలాను' ఆమె ముఖంలో శూన్యం విస్తరించింది.

అంతలోనే తేరుకుంది. చిరునవ్వు మెదిలింది. 'ఇది విధిరాత. దేవుడి నిర్ణయానికి తలొగ్గక తప్పదు కదా!' నిట్టూర్చింది శాంతి.

'విజయ్ సంతోషంగా వున్నాడా?'

'జీవితంతో రాజీపడటం నేర్చుకున్నాడు' చెప్పాను నేను.

తర్వాత మరికాస్సేపు అదీ ఇదీ మాట్లాడు




కున్నాం. నా చిన్నకొడుకు ముద్దుముచ్చట్ల గురించి చెప్పి ఆమె ధ్యాస మరల్చడానికి ప్రయత్నించాను.

బస్సులో ఆమె నా అడ్రస్ తీసుకుని, కొన్నిరోజుల తర్వాత నన్ను కలుసుకుంది. మేమిద్దరం కలిసి విజయ్‌ను కలవడానికి హైదరాబాద్ వెళ్ళాం. నేను ఫోన్ చేయగానే శాంతిని కలవడానికి విజయ్ వచ్చాడు.

ఇద్దరి మధ్య సుదీర్ఘ నిశ్శబ్దం పరుచుకుంది. వాళ్ళను వదిలి నేను ఇతర మిత్రులను కలుసుకోవడానికి వెళ్ళాను.

సాయంత్రం తిరిగి వచ్చాక శాంతి ఒక్కర్తే కనిపించింది.

'నేను వెంటనే వైజాగ్ వెళ్ళిపోవాలి. ఏర్పాట్లు చేయగలవా' ప్రశ్నించింది.

'విజయ్ ఏడీ?' అడిగాను నేను.

'వెళ్ళిపోయాడు' ప్రశాంతంగా, నిర్వికారంగా చెప్పింది శాంతి. అదే సమయంలో ఆమె ముఖంలో ఆత్మవిశ్వాసం, ఆనందం వెల్లివిరిశాయి.

ఆమె ప్రయాణానికి ఏర్పాట్లు చేసి, విజయ్ ఇంటికి వెళ్ళాను. అతడు లాన్‌లో కూర్చుని పున్నమి వెన్నెలలో చల్లని గాలిని ఆస్వాదిస్తున్నాడు.

***

'నేను శాంతిని మళ్ళీ కలుసుకోవాలనుకోలేదు' చెప్పాడు విజయ్, దీర్ఘంగా ఆలోచిస్తూ.

నా వంక తిరిగి మందహాసం చేశాడు. 'శాంతి నిన్ను కలుసుకోవడానికి వచ్చిందని నీవు చెప్పగానే, నాలో మెదలిన మొదటి ఆలోచన అది. ఆమె ఎంతో నిర్దయగా నన్ను విడిచి, ఆ మనిషిని పెళ్ళి చేసుకుంది. అందుకే ఆమె ముఖం మళ్ళీ చూడాలనుకోలేదు' అలా గొణుగుతూ ఆలోచనల్లోకి జారిపోయాడు విజయ్.

'బహుశా ఆమె చేసిందే సరైన పని ఏమో! డిగ్రీ అప్పుడే పూర్తయింది. చదువులో, వృత్తిలో వెళ్ళవలసిన దూరం ఇంకా ఎంతో వుంది. మా తల్లిదండ్రులెవరూ మా ప్రేమను అంగీకరించలేదు. కాబట్టి ఆమె నిర్ణయమే సరైందేమో!' విజయ్ ముఖంలో చిరునవ్వు తిరిగొచ్చింది. అతడి కళ్ళు ప్రశాంతంగా ప్రకాశించాయి.

'ఆమెను కలుసుకునే ముందు నా మనసు పరిపరివిధాలుగా పోయింది. మొదట ఆమెను కలుసుకోకూడదనుకున్నాను. అంతలోనే మనసు లోతుల్లో కప్పబడిన ప్రేమ పెల్లుబికింది. ఆమె వద్దకు పరుగెత్తుకెళ్ళి గుండెలకు హత్తుకోవాలనుకున్నాను. ఆమె గుండెల్లో తలదాచుకుని తనివితీరా విలపించాలనుకున్నాను, ఇంకా ఏవేవో చేయాలనుకున్నాను' కాస్సేపు మాటల ప్రవాహం ఆగింది. 'తీరా ఆమెను కలిసేసరికి ఈ ఆలోచనలేవీ నన్ను కమ్ముకోలేదు. మిత్రులను చిరకాలం తర్వాత కలుసుకున్నప్పుడు కలిగే ఆనందమే నాలో మెదిలింది. ఆమె సమక్షంలో నా కోరికలు, ఆలోచనలూ ఎగిరిపోయాయి. మేమిద్దరం కొంతసేపు నిశ్శబ్దంగా ఒకరినొకరు చూసుకుంటూ నిలబడిపోయాం. తర్వాత అంతా మామూలే! ఒకరి గురించి ఒకరు మాట్లాడుకున్నాం. హుందాతనం హద్దులు దాటలేదు' చెప్పాడు విజయ్.

'నా భార్యను కలవడానికి శాంతి ఇక్కడికి వచ్చింది' నివ్వెరపోయిన నా ముఖంలోకి చూస్తూ తెలియజేశాడు విజయ్.

'ఇక్కడికొచ్చిందా!' ఆశ్చర్యంగా అడిగాను.

'అవును. నా భార్యను చూడటానికి వచ్చింది. స్వీట్లూ, చీరా తీసుకొచ్చింది. ఇద్దరూ కాస్సేపు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. శాంతితో నా ప్రేమ వ్యవహారం నా భార్యకు తెలుసు. మొదట్లో ఆమెను కలవడానికి ససేమిరా అన్నది. అయితే, శాంతి హుందాతనం నా భార్యకు ఎంతో నచ్చింది. ఇద్దరూ మంచి స్నేహితులైపోయారు. శాంతి రోజంతా మా ఇంట్లోనే వుంది. నువ్వు హోటల్‌కు తిరిగి రావడానికి గంట ముందు మేము తిరిగొచ్చాం' నవ్వుతూ చెప్పాడు. ఇంకా ఇలా చెప్పుకుపోయాడు.

'నీ జీవితంలో ఎంత సమయాన్ని వృథా చేశావ్' అని శాంతి నన్ను మందలించింది.

'నువ్వు ఇంకా ముందుగానే పెళ్ళి చేసుకోవలసింది. దేనికోసం అంతకాలం నిరీక్షించావు?' అని నిలదీసింది.

'నిన్ను మరచిపోలేకపోయాను' అని చెప్పాను.

'అది వెర్రితనం' శాంతి దృఢంగా అన్నది. 'జీవితంలో ఎన్నో కోల్పోతాం. వాటన్నింటినీ మనసులో పెట్టుకుని కుమిలిపోవడం మంచిది కాదు. ఆ భారం మనం మోయలేం, మోయకూడదు కూడా... పోగొట్టుకున్నది తిరిగిరాదు. అంతే' నా కళ్ళలోకి సూటిగా చూస్తూ చెప్పింది శాంతి.

'నీ భార్య ఎంతో చక్కనైనది' ఈ సంగతి చెబుతూ శాంతి మనసారా నవ్వింది.

నా భార్య గురించిన ఆలోచన ఆమెలో కొత్త శక్తి తీసుకొచ్చినట్లుంది. 'ఆమెను సదా ఆనందంగా ఉండనివ్వు' శాంతి ఆర్డరు వేసింది.

'మరి నీ సంగతి ఏమిటి?'

'నా సంగతా! ఈ భవబంధాలతో విసిగిపోయాను. తల్లిదండ్రులు, మిత్రులు, పెళ్ళి, చివరకు ప్రియుడితో కూడా' అని అంటూ చిలిపిగా నా కళ్ళలోకి చూసింది శాంతి.

'అమ్మానాన్నలు నాకు కొంత ఆస్తి మిగిల్చివెళ్ళారు. ఇక దీనజన సేవలో తరిద్దామనుకుంటున్నాను. కలకత్తా వెళ్ళి మదర్ థెరిసా ఫౌండేషన్‌లో చేరబోతున్నాను. బహుశా నాకు స్వచ్ఛమైన ప్రేమ అక్కడే లభిస్తుందేమో!' చెప్పింది శాంతి.

***

విజయ్‌ని కలిసిన కొద్దిరోజులకు స్వస్థలం తిరిగొచ్చేశాను. విజయ్ మళ్ళీ తన పనిలో తీరిక లేకుండా వున్నాడు. అతడి భార్య హృదయంలో శాంతికి గౌరవప్రదమైన స్థానం ఉన్నది. తర్వాత కొంతకాలం శాంతి దగ్గర నుంచి ఏ కబురూ లేదు. కలకత్తాలో స్థిరపడిన తర్వాత ఆమే నాకు ఫోన్ చేసింది. 'విజయ్‌ను చివరిసారి కలుసుకోవడానికి సాయం చేసినందుకు నాకు కృతజ్ఞతలు చెప్పింది. నేను బస్సులో ఆమెకు తారసపడడం భగవదేచ్ఛ అని భావించింది.

నా తోటలో క్రోటన్ మొక్కపై నుంచి ఏకదళం ఎట్టకేలకు వేరుపడింది. తల్లి మొక్క నుంచి తల్లులకు తల్లి భూమాత ఒడి చేరింది. అక్కడ అది మరింత అందంగా మెరిసిపోతోంది. తనకు బదులు కొత్త ఆకులకు చోటిచ్చి తృప్తిగా నేల చేరింది. అక్కడ అది నెమ్మదిగా ఒడలిపోయి మట్టి మాతలో శాశ్వతంగా కలిసిపోయింది. రుతువులు ఒకదాని వెంట ఒకటి వస్తూనే వుంటాయి. కాలం ప్రవహిస్తూనే వుంటుంది. పుట్టి గిట్టడం, మళ్ళీ పుట్టడం... ఇది సహజ సృష్టి క్రమం. నేలరాలిన ఆకు స్థానంలో కొత్త ఆకు చిగురిస్తుంది. అదే జీవన సౌందర్యం. వృద్ధులు వైదొలగి యువతకు చోటిస్తారు. యువత ఈ ప్రపంచంలో నవ్వుల పువ్వులు పూయిస్తారు. తల్లి మొక్క నుంచి జీవం పొంది, జీవనేచ్ఛతో తొణికిసలాడి, చివరకు తల్లి నుంచి బంధం తెంచుకుని వెళ్ళిన ఆకు మల్లేనే శాంతి కూడా అన్ని భవబంధాలకు దూరంగా వెళ్ళిపోయింది. ఆత్మసంకల్పంతో బంధాలూ, బాధలను దూరం చేసుకుంది. తాను కోరుకున్న జీవితాన్ని స్వేచ్ఛగా గడుపుతోంది. అన్ని లంపటాలను అంతం చేసుకోవడంలోనే స్వచ్ఛమైన ప్రేమను కనుగొంది. ఇప్పుడామె జీవన సూత్రం – ప్రేమను పంచడమే.